ఇది కలెక్టర్ ఇలాకాలోని ధవళేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయం. కార్యాలయంలో విద్యుత్ దీపం(వృత్తంలో) సోమవారం పట్టపగలు ఇలా వెలుగుతూ కనిపించింది.

కలెక్టరేట్ వద్ద ఆశాల ధర్నా

ఒప్పంద జిఒలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వంతో గతంలో జరిగిన ఒప్పందాల మేరకు, ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్ కాపీ ప్రకారం జిఒలను, సర్క్యులర్లు వెంటనే విడుదల చేయాలంటూ ఆశావర్కర్లు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతికి యూనియన్ నాయకులు వినతిపత్రం అందించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎ.అన్నామణి అధ్యక్షత జరిగిన ధర్నాలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, గౌరవ అధ్యక్షులు ఎం.సుందర్‌బాబు మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు మినిట్స్ ప్రకారం జిఒలు విడుదల చేయకపోవడంతో ఆశా వర్కర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇటీవల కాలంలో రిటైర్మెంట్ అయిన వర్కర్స్‌కు రిటైర్మెంట్ బెనిఫిట్ అందలేదన్నారు. 60 సంవత్సరాలు నిండిన వారు రెండు సంవత్సరాల వయోపరిమితి పెంపుదలకు అనర్హులుగా మిగిలిపోయారన్నారు. ఇటీవల మరణించిన ఆశా వర్కర్లకు మట్టి ఖర్చులు రూ.20వేలు అందించలేదన్నారు. ఆశా వర్కర్లకు బీమా సౌకర్యం అందించలేదని ఖాళీ పోస్టులు భర్తీ చేయలేదని, జీతంతో కూడిన మెటర్నిటీ లీవ్ సౌకర్యం కల్పించలేదన్నారు. జిఒలు విడుదల చేయకపోవడంతో ఆశాలు మానసికంగా, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆశాలు నిర్వహించే రిజిస్టర్లను ప్రభుత్వమే అందించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వర్కర్స్‌కు సెలవులు పరిమిషన్ ఇవ్వాలన్నారు. సంబంధం లేని పనులు చేయించరాదన్నారు. ఆశాల విధుల్లో రాజకీయ జోక్యం నిరోధించాలని, విహెచ్ఎన్‌సి కమిటీల ద్వారా వర్కర్ల తొలగింపును ఆపాలన్నారు. నాణ్యమైన యూనిఫామ్ అందించాలని, ఎఎన్ఎం పోస్టుల భర్తీలో ఆశా వర్కర్లకు వెయిటేజ్ ఇవ్వాలన్నారు. ఎఎన్ఎం ట్రైనింగ్ అయిన ఆశాలకు వెయిటేజ్ మార్కులు కల్పించాలన్నారు. పల్లె ప్రాంతాల్లో 1,500 మంది జనాభాకు ఒక ఆశా వర్కర్స్ పట్టణ ప్రాంతాల్లో 2వేల మంది జనాభాకు ఆశ వర్కర్స్‌ను నిబంధనల ప్రకారం నియమించాలన్నారు. 2024 ఫిబ్రవరి నుంచి రిటైర్మెంట్ అయిన వారిని యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలన్నారు. కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ ధర్నాకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎస్ఎస్.మూర్తి, జిల్లా నాయకులు బి.పవన్, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.బేబీరాణి కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు తదితరులు మద్దతు తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు ఐ.మేరీ, టి.రామతులసి, టి.నాగమణి, పి.అనూష, ఎ.ధనలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, ఎం.హవీల కుమారి, వి.రాజకుమారి, ఎం.కుమారి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న ఆశాలు

ఆశాలు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

దీక్షా శిబిరం వద్ద ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న 108 సిబ్బంది

సమస్యలపై 108 సిబ్బంది రిలే దీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమస్యలను పరిష్కరించాలంటూ 108 సర్వీస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ రిలే నిరాహార దీక్షను సోమవారం చేపట్టారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.పూర్ణిమ రాజు, అధ్యక్ష, కార్యదర్శులు ఇఎన్‌వి.రమణ, జి.రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఎం.నగర కార్యదర్శి బి.పవన్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.రాంబాబు, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి బేబి రాణి, ఆశా వర్కర్ జిల్లా కార్యదర్శి వెంకట లక్ష్మి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 108 అంబులెన్స్ సర్వీస్‌లోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ కొద్ది రోజులుగా యాజమాన్యం, అధికారులకు విన్నవించారన్నారు. ఈ శాంతియుతంగా పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారన్నారు. అయినా ఎలాంటి స్పందన లేకపోవడంతో నిరసన దీక్షలకు దిగారన్నారు. ఇప్పటికైనా అధికారులు, యాజమాన్యం స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకుంటే ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామన్నారు. 108 వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పనివిధానం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని, వైద్య ఆరోగ్య శాఖలో ఇంటిలో పోస్టుల నియామకాల్లో స్థానం కల్పించాలన్నారు. జిఒ 49 ప్రకారం నెలకు రూ.4వేలు చెల్లించాలన్నారు. సహజ, ప్రమాద మరణం పొందిన ఉద్యోగి కుటుంబానికి రూ. 25లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, జనరల్ సెక్రెటరీ ఇఎన్‌వి.రమణ, గుబ్బల రమేష్‌బాబు, నానాజీ, వెంకటేశ్వరరావు, రమేష్ నాయుడు, శ్రీధర్, జగపతి, నంది రాజు, సునీత, శ్రావణి, సుమలత, విజయ తదితరులు పాల్గొన్నారు. రిలే నిరాహారదీక్షల్లో జె.నానాజీ, జి.రమేష్‌బాబు, ఎస్.శ్రీనివాస్, పి.జగపతిబాబు, వాసు, సునీత కూర్చొన్నారు. పూర్ణిమ రాజు వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కడియం

నేపాల్‌లో జరిగే కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న కె.దివ్యశ్రీకి పలువురు ఆర్థిక సాయం అందించారు. పేద విద్యార్థినిని ఆదుకునేందుకు దాతలు ముందుకు వచ్చారు. కడియం మండలం బుర్రిలంకకు చెందిన నర్సరీ అసోసియేషన్ కార్యదర్శి గాద నాగేశ్వరరావు మిత్రబందం రూ.23 వేలు, కడియపులంక సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ రూ.10 వేలు, కడియం గ్రామానికి చెందిన వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగి విల్సన్ పాల్ మిత్రబందం రూ.17 వేలు, జిల్లా వ్యవసాయ కార్యాలయం సిబ్బంది రూ.10 వేలు, మొత్తంగా కలిపి రూ.60 వేలను సోమవారం సర్పంచ్ రాంజీ చేతులు మీదుగా విద్యార్థి దివ్యశ్రీ కి అందజేశారు. విద్యార్థి ఉన్నతకి మరింత ఆర్థిక సాయం అందించేందుకు ముందుంటామని వారు హామీ ఇచ్చారు. దేశానికి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆణిముత్యాలను వెలుగులోకి తెచ్చేందుకు మరింత మంది దాతలు అవసరం మేరకు ఆర్థిక సహాయం చేయాలని సర్పంచ్ రాంజీ కోరారు.

సాయం అందిస్తున్న సర్పంచ్ రాంజీ తదితరులు

నైపుణ్య శిక్షణ కోసం ఒప్పందం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

నగరంలోని ఆర్ట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం విజయవాడలోని అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్, రాజమండ్రిలోని జీవచిత్రనం సంస్థలతో రెండు అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుంది. నూతన విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ఈ సంస్థలు ముందుకు వచ్చాయి. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సునీల్‌కుమార్ కృషి మేరకు ఈ సంస్థలు విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తాయి. ఇంటర్న్‌షిప్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టులు నిర్వహణ వంటివి చేపడతాయి. అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరపున ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ చింతా, జీవచిత్రనం సంస్థ తరపున ఆ సంస్థ ఆపరేషన్స్ అధిపతి సత్య వెంకటేష్ కలిగట్ల, ఆర్ట్స్ కళాశాల తరపున కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగ అధిపతులు, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

గుడ్డిగూడెంలో అన్నదానం

ప్రజాశక్తి - గోపాలపురం

గుడ్డిగూడెం గ్రామ శివారులో శివాలయం వద్ద సోమవారం అన్నదానం నిర్వహించారు. గుడ్డిగూడెం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రతి ఏడు వనభోజనాలను శివాలయం వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్నదానానికి నాలుగువేల మంవది వరకూ హాజరయ్యారని తెలిపారు.

కోరుకొండ నరసన్నను దర్శించుకున్న బొడ్డు

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి సోమవారం దర్శించుకున్నారు. 108 లీటర్ల పాలతో పాలాభిషేకం నిర్వహించారు. 108 కొబ్బరి కాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పెద్దింటి చంటిబాబు, నాగాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్ చౌదరి, బత్తుల వెంకటలక్ష్మి, తెలగంశెట్టి శ్రీను, రొంగల శ్రీనివాస్, కటకం చలం, కట్టా సత్తిబాబు, కంటే నాగ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటరుగా 63,282 మంది నమోదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికకు సంబంధించి ఓటరు నమోదు కోసం ఇప్పటి వరకూ 63,282 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆన్ లైన్ ద్వారా 12,883, ఆఫ్ లైన్ ద్వారా 31,015 దరఖాస్తులు గ్రాడ్యుయేట్ ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా నవంబర్ 23న ప్రకటించనున్నట్లు ఆమె తెలిపారు. గత గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి 61 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 82 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. గతం కంటే అదనంగా 21 పోలింగ్ కేంద్రాలు పెరుగుతాయన్నారు. ఫారమ్-18 లేదా 19లో దరఖాస్తును స్వీకరించడానికి నవంబర్ 6 చివరి తేది అన్నారు. నవంబర్ 20న మాన్యుస్క్రిప్ట్‌ల రూపకల్పన, 23న ఎలక్టోరల్ రోల్స్ ముసాయిదా ప్రచురణ జరుగుతుందన్నారు. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9వరకూ దీనిపై అభ్యంతరాలను తెలియజేయొచ్చన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సప్లిమెంట్‌లను పరిష్కరించే తేదీని సిద్ధం చేస్తామన్నారు. డిసెంబర్ 25న ఎలక్టోరల్ రోల్స్ ప్రచురణ కాగా, పట్టభద్రుల ఓటర్ల తుది ఓటర్ల జాబితా డిసెంబర్ 30న విడుదల చేస్తామన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ అయ్యే ఓటు చెల్లుబాటు అయ్యే విధంగా రాజకీయ పార్టీలు మాన్యుయేల్ ఓటింగుపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఎంఎల్‌సి పట్టభద్రుల ఓటర్ల పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మండలానికి కనీసం ఒక పోలింగ్ స్టేషన్‌ను ప్రతిపాదించామన్నారు. ఓటరు తన ఓటు వేయడానికి ప్రయాణించాల్సిన గరిష్ఠంగా అనుమతించదగిన దూరం 16 కిలోమీటర్లు ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలు అన్ని ప్రభుత్వం భవనాల్లోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామచంద్రరావు, బిఎస్‌పి నాయకులు పట్నాల విజయ్ కుమార్, ఆప్ జిల్లా అధ్యక్షులు వై.శ్రీనివాసరావు లు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

అదనపు ఎస్‌పి మురళీకృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గుబ్బల రాంబాబు తదితరులు

అదనపు ఎస్‌పికి స్వర్ణాంధ్ర అభినందనలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా అదనపు ఎస్‌పి(అడ్మిన్)గా బాధ్యతలు స్వీకరించిన ఎన్‌బిఎం.మురళీకృష్ణకు స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. సోమవారం స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు ఆధ్వర్యంలో పడాల రామిరెడ్డి, భువనగిరి వెంకటరమణ, ఎమ్.కె.బేగ్, నాగేశ్వరరావు తదితరులు మురళీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఈ జిల్లాలో పనిచేసినప్పుడు మురళీకృష్ణ మంచి పేరు పొందారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎంతో చొరవ చూపారన్నారు. ఆయన అదనపు ఎస్‌పిగా రావడం ఆనందంగా ఉందన్నారు.

26న నిరసనల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్రంలో బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వం, రాష్ట్రాల్లో దాని భాగస్వామ్య పక్షాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆందోళనకు కేంద్ర కార్మిక, రైతు సంఘాల పిలుపునిచ్చాయి. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల నేతత్వంలో నిర్వహించే ఈ ఆందోళనల్లో కార్మికులు, రైతులతో పాటు వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణపై చర్చించేందుకు సిఐటియు, ఎఐటియుసి, రైతు సంఘం తదితర సంఘాల ఉమ్మడి సమావేశం సోమవారం సిపిఐ కార్యాలయంలో జరిగింది. సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయా సంఘాలకు చెందిన 12 మంది నాయకులు మాట్లాడారు. వ్యవసాయ రంగ కార్పొరేటీకరణ, జీవనోపాధులపై బిజెపి ప్రభుత్వాలు సాగిస్తున్న దాడులను తిప్పికొట్టాలన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో విశాల ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం, అందరికీ ఉపాధి, 200 రోజుల పని, ఉపాధి హామీ కింద రోజు వారీ వేతనం రూ.600, ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్), ధరల నియంత్రణ వంటి డిమాండ్లతో ఈ దేశవ్యాప్త ఆందోళన చేపట్టనున్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, బి.పవన్, రైతు సంఘం జిల్లా కన్వీనర్ సుబ్బారావు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు, జిల్లా కన్వీనర్ జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షులు కే.రాంబాబు, సిపిఐ నగర కార్యదర్శి కొండలరావు, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట లక్ష్మణ్, సిఐటియు నాయకులు కె.రామకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇసుక ర్యాంపులో జెసి తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

వంగలపూడి ఇసుక ర్యాంపులో జెసి చిన్నరాముడు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక తరలింపునకుకొరకు పది ట్రాక్టర్లకు ప్రభుత్వ అనుమతులున్నాయన్నారు. అనుమతులు పొందిన ట్రాక్టర్లను ఎవరూ నిలుపుదల చేయరాదని సూచించారు. స్థానికులు, ఇసుక ర్యాంపుల వద్ద లోకల్ ట్రాక్టర్లనే వినియోగించాలన్నారు. ర్యాంపు నిర్వాహకులు స్థానికులతో సామరస్యంగా చర్చించుకోవాలని కొంత సమయం ఇచ్చారు. ఒక మెట్రిక్ టన్ను రూ.300 అధిక ధరలకు స్టాక్ పాయింట్ నుంచి పాన్ ఇండియా నిర్వాహకులు విక్రయిస్తున్నారని వార్తలపై జెసి స్పందించారు. తగిన ఆధారాలు ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇరు పక్షాలు చర్చించుకొని ర్యాంపు నిర్వహణకు అంగీకారం తెలిపినట్లు సీతానగరం తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. జెసి వెంట తహశీల్దార్ సిబ్బంది ఉన్నారు.

కోరుమిల్లిలో మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి - పెరవలి

కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కోరుపల్లి గ్రామంలో సోమవారం పిహెచ్‌సి వైద్యులు కె.హేమరాజ్ ఆరోగ్య విస్తరణ అధికారి జి.సత్యేంద్ర కుమార్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ హేమరాజ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించరన్నారు. దోమలకు సంబంధించిన వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, డివిజన్ పంచాయతీ ఆఫీసర్ వై.అమ్మాజీ, ఆశాలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంపీ పరామర్శ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో ఇటీవల విద్యుత్ షాక్‌తో మరణించిన వారి కుటుంబాలను ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు తదితరులున్నారు.ఉండ్రాజవరం, సూర్యారావుపాలెం, చివటం గ్రామాల నుండి గౌడ, శెట్టిబలిజ సంఘాలు, వెలగదుర్రుకు చెందిన చిటికెన సుబ్బారావు రూ.1,18,500 సాయం అందించారు..

ఆడంబరాలు కాదు అవసరాలు తీర్చాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

పుట్టినరోజు, ఇతర శుభకార్యాల సందర్భంగా ఆడంబరాలకు పోకుండా పేదల అవసరాలు తీర్చడానికి ముందుకు రావాలని మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. వెంకటేశ్వరరావు కుమారుడు అంజన్ రుచిర్ పుట్టినరోజును సోమవారం తాళ్లపూడిలోని బాలుర వసతిగృహంలో నిర్వహించారు. విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకవసరమైన సుమారు రూ.4వేల విలువైన విద్యాసామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో రుచీర్ తల్లి రమాదేవి నానమ్మ వరలక్ష్మి బంధువులు స్వాతి, కీర్తన, షర్మిల, పండు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కనీస పింఛను కోసం ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇ వి ఎ స్ - 9 5 పెన్షనర్లకు కనీస పెన్షన్ నెలకు రూ. 9వేలు ఇవ్వాలంటూ పెన్షనర్లను సోమవారం నగరంలో పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఇపిఎస్ -95 పెన్షనర్స్ విద్రోహదినం పాటించారు. ఈ సందర్భంగా ఎపిఆర్‌పిఎకార్యదర్శి మోహనరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇపిఎఫ్-95 పెన్షన్ విధానం 1995 నవంబర్ 16న ప్రారంభించిందన్నారు. దీన్ని విద్రోహదినంగా పాటిస్తున్నామన్నారు. 29 ఏళ్లయినా ప్రభుత్వం లో మార్పు రాక పోవడం దుర్మార్గమన్నారు. ఈ పథకంలో ప్రస్తుతం 75,58,913 మంది పెన్షనర్లు ఉన్నారన్నారు. సభ్యుల నుంచి రూ. 7,80,309 కోట్ల కార్పస్ ఫండ్ జమైందన్నారు. ఇందులో అసలు రూ.64,886 కోట్లు, వడ్డీ రూ.51,885 కోట్లు ఉన్నాయన్నారు. రూ.1000 చొప్పున మొత్తం పెన్షనర్లకు రూ.14,444 కోట్లు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. వడ్డీ డబ్బులు రూ.51వేల కోట్లతో కనీస పంఇంఛను రు.5వేల వరకూ చెల్లించొచ్చన్నారు. హయర్ పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. పెన్షనర్లకు ఉచిత ఆరోగ్య పథకం అమలు చేయాలని, రైలు ప్రయాణాల్లో రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ కోశాధికారి ప్రభాకర్, అప్పారావు, బలరాం రాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి పూర్ణిమరాజు

నిరాశాజనకంగా బడ్జెట్ సమావేశాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత నిర్వహిస్తున్న తొలి బడ్జెట్ సమావేశాలు రాష్ట్ర ప్రజలను నిరాశ పరిచాయని సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు పి.టాన్య అన్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల పేరు చెప్పి ప్రజలను ఆశల పల్లకి ఎక్కించారన్నారు. తాజా బడ్జెట్లో ఆ పథకాలకూ నిధుల కేటాయింపులకు పొంతనే లేదని విమర్శించారు. జిల్లాలో సాగునీటి వనరుల కోసం రూ.50 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. కోనసీమ రైల్వే లైన్ ఊసే లేదన్నారు. ఇది ప్రజలకు పరిపూర్తిగా న్యాయం చేసే బడ్జెట్ కాదన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను, వారి భద్రత కోసం చర్చే లేదన్నారు. రైతులకూ చెప్పుకోదగ్గ ప్రయోజనం లేదన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ, కార్మికరంగాలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో చీకట్ల వెంకటేశ్వరరావు, ఎస్.కిరణ్‌కుమార్, పి.విజయ, కె.భానుప్రసాద్ కె.సూరిబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఐదేళ్ల చిన్నారిపై 24 ఏళ్ల యువకుడు లైంగిక దాడికి యత్నించిన సంఘటన ఇది. దీనికి మండలంలోని ఒక గ్రామంలో ఐదేళ్ల బాలికను సోమవారం పక్కింటికి చెందిన 24 ఏళ్ల యువకుడు తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికను గదిలోకి రప్పించి అసభ్యంగా ప్రవర్తించాడు. లైంగిక దాడికి ప్రయత్నించాడు. చిన్నారి కేకలు వేయడంతో చిన్నారి తల్లి పరుగున వెళ్లి జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువకునిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు అమలాపురం డిఎస్‌పి టిఎస్‌ఆర్‌కె ప్రసాద్ తెలిపారు.

కాలువలో బాలుడు గల్లంతు

ప్రజాశక్తి -దేవరపల్లి

ఆదివారం సెలవు దినం కావడంతో పోలవరం కుడికాలువలో ఏడుగురు విద్యార్థులు ఈతకు వెళ్లారు. వీరిలో పాముల గౌతం(13) అనే విద్యార్థి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. విద్యార్థులంతా దేవరపల్లి ప్రభుత్వ పాఠశాలలోని ఏడో తరగతి చదువుతున్నారు. విద్యార్థి గల్లంతైన విషయం తల్లిదండ్రులకు, బంధువులకి తెలపకుండా మిగతా విద్యార్థులు గోప్యంగా ఉంచారు. గౌతమ్ ఆచూకీ తమకు తెలియదని సమాధానం ఇవ్వడంతో రాత్రంతా కుమారుని కోసం వారు గాలింపు చేపట్టారు. విషయం తెలుసుకొన్న పోలీసులు రంగంలోకి దిగారు. గజ ఈతగాళ్లతో కాలవలో గాలింపు చర్యలు చేపట్టారు.

సారా బట్టీపై దాడి : వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గండేపల్లి

సారా బట్టీపై పోలీసులు దాడి చేసి ఒక వ్యక్తిని అరెస్టు చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని కె.గోపాలపురం గ్రామానికి చెందిన జి.అప్పన్న సారా తయారు చేస్తుండగా దాడి చేసి అరెస్టు చేశారు. అతని వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 200 మీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిని కోర్టులో హజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని, ఆ ముద్దాయిని సబ్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

ప్రజాశక్తి - జగ్గంపేట

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి 2 రోజుల జైలు శిక్షతోపాటు, రూ.10 వేలు చొప్పున పెద్దాపురం మెజిస్ట్రేట్ జరిమానా విధించారని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానికంగా సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇద్దరిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి శిక్షతోపాటు, జరిమాన విధించారని వివరించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఆరుగురికి రూ.600 చొప్పున జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

2,700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురం, కాండ్రకోట గ్రామాల్లో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 2,700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ఎస్ఎస్ఎస్.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన రఘుదేవపురంలో చోటు చేసుకుంది. ముగ్గళ్ళ గ్రామానికి చెందిన మిరప శ్రీను రఘుదేవపురం రవిచంద్ర కాలనీ వెనుక పంట పొలానికి సోమవారం నీటితడి పెడుతున్నాడు. ఈ సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సీతానగరం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాము కాటుతో బాలుడు మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

పాముకాటుకు గురై ఏడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన నల్లజర్ల మండలం సింగరాజుపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం నల్లజర్ల గ్రామానికి చెందిన బోయపాటి సాగర్, కవిత భార్యాభర్తలు. వారికి బోయపాటి ధనుష్(7) కుమారుడు ఉన్నాడు. ఆదివారం సింగరాజుపాలెంలో పెద్దమ్మ ఇంటికి వెళ్లాడు. అక్కడ ఆరుబయట బాణ సంచా కాలుస్తుండగా తాచుపాము ధనుష్ కాలిపై కాటు వేసింది. వెంటనే ధనుష్‌ను తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మార్గం మధ్యలోనే మృతి చెందాడు.

సందిపూడిలో చెరువు గట్టుపై ఆక్రమణల తొలగింపు

చెరువుగట్టుపై ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని సందిపూడిలో ప్రధాన రహదారి చెంతన ఉన్న చెరువుగట్టు పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలను పంచాయతీ రాజ్, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ సమన్వయంతో సోమవారం తొలగించారు. ఎంపిడిఒ ఐ.రాజు, ఎస్ఐ ఎం.అశోక్ ఆధ్వర్యంలో తొలగింపులు పూర్తి చేశారు. గత కొంతకాలంగా చెరువుగట్టు పరిసర ప్రాంతాల్లో కొంతమంది పబ్లిక్ టాయిలెట్స్‌ను తొలగించి ఆ ప్రదేశాన్ని ఆక్రమించుకుని షెడ్లను నిర్మించుకున్నారు. ఇది గమనించిన పంచాయతీ అధికారులు స్పందించి ఆక్రమణలను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ ఖాళీ చేయకపోవడంతో పోలీస్ బందోబస్తు, యంత్రాల సహకారంతో రెవెన్యూ సిబ్బంది మూడు షెడ్లను తొలగించారు. దీంతో ఆ ప్రాంతంలో కొంత సమయం ఉద్రిక్తతకు దారితీసింది.

వారోత్సవాలు సరే.. గ్రంథాలయం మాటేంటి?

సమస్యల మధ్యే పాఠకుల పఠనం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రంథాలయాల ప్రాముఖ్యతను తెలిపేందుకు ప్రతి ఏటా గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రంథాలయోద్యమకారుల త్యాగాలను గుర్తు చేసుకుంటున్నారు. విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తున్నారు. గ్రంథాలయాల విశిష్టతను తెలియజేస్తున్నారు. ఇదంతా.. బాగానే ఉన్నా.. గ్రంథాలయాల్లో సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

మండలంలోని 15 గ్రామాలకు మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో ఒకే ఒక్క గ్రంథాలయం ఉంది. 2010వ సంవత్సరంలో నిర్మించిన ఈ గ్రంథాలయం పుష్కరకాలం గడవకముందే ఫ్లోరింగ్ కుంగిపోయి, లోపలికి వెళ్లే మెట్లు కూడా పగిలిపోయి, శిథిలావస్థకు చేరుకుంది. పాఠకులు కూర్చునేందుకు కనీస సౌకర్యం కూడా ఇక్కడ లేదు. ఈ గ్రంథాలయానికి మరమ్మతులు చేపట్టాలని పలువురు పాఠకులు కోరుతున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ రిసోర్స్ పర్సన్ పెరుమాళ్ళ రాందాస్ అధికారులు స్పందించి, గ్రంథాలయానికి తక్షణ మరమ్మతులు చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తుంది. విజ్ఞానాన్ని అందించే కొత్త పుస్తకాలు కావాలని పాఠకులు, విద్యార్థులు కోరుతున్నారు. ఒక ఇంగ్లీషు పేపర్‌తో కలిపి ఆరు దినపత్రికలు, వార, పక్ష, మాస

పత్రికలు మొత్తం కలుపుకొని 20 వరకూ అందుబాటులో ఉన్నాయనఅనరు. ఈ గ్రంథాలయానికి ప్రతి రోజూ సుమారు 50 మంది వరకూ పాఠకులు, పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు, విచ్చేస్తుంటారు. ప్రభుత్వం ఆధునిక విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు, మ్యాగజైన్లు పంపిణీ చేస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించిన వారవుతారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. గ్రంథాలయంలో సమస్యలను పరిష్కరించి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

అందరికీ అండగా ఉంటా : తలారి

ప్రజాశక్తి - తాళ్లపూడి

వైసిపి కార్యకర్తలకు, నాయకులకు అందరికీ అండగా ఉంటానని, పార్టీలు మారిన, మారుతున్న వ్యక్తులపై లోతుగా ఆలోచన చేద్దామని వైసిపి కొవ్వూరు నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం పార్టీ వర్గాలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. తలారి మాట్లాడుతూ మోసపూరిత మాటలకు, పాలనకు చిరునామా చంద్రబాబు నాయుడు అని అన్నారు. సూపర్ సిక్స్ పథకం ప్రచారానికే పరిమితం చేశారని విమర్శించారు. వైసిపి నాయకుల, కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ అధికార పార్టీ దురాగతాలను, మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. తాళ్లపూడి ఎంపిపి సైకిల్ ఎక్కడంతో ఆ స్థానాన్ని భర్తీ చేయాలని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై తలారి మాట్లాడుతూ పార్టీని వీడిన వారి విషయాలపై మరోసారి సమావేశం నిర్వహిద్దామన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు కె.కేశవనారాయణ, కొమ్మిరెడ్డి పరశురామారావు, యాళ్ల బాబూరావు, గూడ విజయరాజు, పిట్టా శ్రీను, సిర్రా గంగారావు, నూతంగి సురేష్ పలు గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు

లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ పి. ప్రశాంతి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వివిధ విభాగాలకు సంబంధించిన లక్ష్యాలను తత్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో గృహనిర్మాణం, డ్వామా మెటీరియల్ లేబర్, అంగన్‌వాడీ పనులు,నైపుణ్య శిక్షణ ధాన్యం సేకరణ, నీటి పన్ను వసూళ్లు, రెవిన్యూ, ఎన్‌పిసిఐ, ఎంఎస్ఎంఇ అమలు చేస్తున్న ప్రగతి లక్ష్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 8,236 మంది రైతుల నుంచి రూ.150 కోట్ల విలువైన 65,238.44 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

మిగిలిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గృహ నిర్మాణం పై సమీక్షిస్తూ జిల్లాలో స్టేజ్ కన్వర్షన్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ నవంబర్ నాటికి 44 లక్షల పని దినాలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 39.57 (89.93 శాతం) సాధించామన్నారు. మినీ గోశాల కింద 818 యూనిట్స్ ఏర్పాటుకు గాను 318 (38.88) లక్ష్యాలను సాధించినట్లు తెలిపారు. జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం కింద చేపట్టిన 661 పనులకు 130.178 కిలోమీటర్ల లక్ష్యానికి 376 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 53.842 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేశామన్నారు. అంగన్‌డీ పోషణ కోసం 704 కేంద్రాలకు 630 చోట్ల స్థలాలు గుర్తించారన్నారు. హౌసింగ్ పనుల విషయంలో కమ్యూనిటీ గ్రూపుల ను ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యు, పిజిఆర్ఎస్, ఎంఎస్ఎంఇ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి ఎస్.చిన్నరాముడు, డిఆర్‌ఒ టి.సీతారామమూర్తి, డిఎల్‌డిఒ వీణాదేవి, డిఎస్ఒ కెవిఎస్ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ పోటీలకు కలవలపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు కలవలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం జొన్నకూటి వెంకటశ్రీనివాస్ తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్ సెలక్షన్ పోటీల్లో బంగారు పేట గోదావరి గట్టు వద్ద జరిగిన బీచ్ వాలీబాల్ పోటీల్లో అండర్ -14 విభాగంలో పంతగాని లాస్య, కానుబోయిన తేజ, అండర్-17 విభాగంలో తాడేపల్లి వెన్నెల ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కోచ్ కోయ గంగాధర్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - గోపాలపురం

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ప్రజలకు సూచించారు. సోమవారం గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్యాల ఎస్‌బిఐ బ్యాంకులో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ సతీష్ కుమార్, బ్యాంకు ఉద్యోగులు మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించరాదన్నారు. ఫోన్లకు మెసేజ్ ద్వారా వచ్చిన లింకులు ఓపెన్ చేయడం, గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఆధార్ కార్డు వివరాలు, ఎటిఎం పిన్ వంటి వివరాలు తెలుపరాదన్నారు. సైబర్ నేరాలు, వాటి నివారణ, సురక్షితమైన ఆన్‌లైన్ లావాదేవీలు గురించి వివరించారు. సైబర్ మోసాలు, ఫిషింగ్, కాల్-కలర్ ఐడీ స్కామ్స్, ఇతర సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ఆన్‌లైన్ లావాదేవీలను సురక్షితంగా ఎలా నిర్వహించాలో వివరించారు.

పోలింగ్ కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

నగరంలోని 29, 30 పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, అర్బన్ తహశీల్దార్ పిహెచ్‌జిఆర్.పాపారావులతో కలిసి కలెక్టరు పి.ప్రశాంతి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉమ్మడి పూర్వపు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి డిసెంబర్ 5వ తేది ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకూ పోలింగు జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 20 పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. డిసెంబరు 12వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగు కేంద్రం వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించేలా ఆదేశాలిచ్చామన్నారు.

సూర్యనారాయణరెడ్డికి అనపర్తి మాజీ ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - బిక్కవోలు

అస్వస్థకు గురై రాజమహేంద్రవరంలోని స్వామి వైద్యాలయంలో చికిత్స పొందుతున్న కొంకుదురు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పడాల సూర్యనారాయణరెడ్డి(బాబి)ని అనపర్తి మాజీ ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం పరామర్శించారు. సూర్యనారాయణ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఇసుక దోపిడీదారులను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి- కడియం

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నదీలో యంత్రాల ద్వారా ఇసుకను తోడుకుపోతున్న దోపిడీదారులను వెంటనే అరెస్టు చేయాలని వైసిపి కడియం మండల అధ్యక్షులు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో ఫిషర్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సాక కిరణ్‌కుమార్‌తో కలిసి సోమవారం కడియం సిఐ, తహశీల్దార్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదీ గర్భంలో యంత్రాలను ఉపయోగించకుండా ఇసుకను తరలించుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన కాంట్రాక్టర్ ఎల్ 2, అమలాపురం ప్రాంతానికి చెందిన వారి బినామీలు నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలను వినియోగించి ఈ నెల 17 సాయంత్రం 6 గంటల నుండి ఏకధాటిగా ఇసుకను తరలించకపోయారన్నారు. రాత్రి వేళల్లో ఇసుకను తవ్వరాదని నిబంధన ఉన్న లెక్కచేయకుండా ఇసుకను తరలించారన్నారు. ఇసుక ర్యాంపును ఆనుకొని పట్టాభూములు, వ్యవసాయ భూములు ఉన్నాయన్నారు. జియో కో-ఆర్డినేట్ పరిధిలో కాకుండా ఇష్టానుసారంగా ఇసుకను తవ్వుతున్నారన్నారు. దీనివలన వరదల సమయంలో వ్యవసాయ భూములు కొట్టుకుపోయే పరిస్థితి ఉందన్నారు. భూగర్భ

ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ స్టాలిన్ తదితరులు

జలాలు అడుగంటి వ్యవసాయం మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఈ అక్రమ తవ్వకాలపై విచారణ జరిపి, రాత్రి లారీల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించుకుపోయిన ఎల్ 2 కాంట్రాక్టర్ అతని బినామీపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు నాగిరెడ్డి వీరశివాజీ, పాలపర్తి ప్రకాష్‌కుమార్, మాజీ ఫిషర్‌మెన్ సొసైటీ ప్రెసిడెంట్ బల్ల అన్నవరం, మారె శ్రీనివాసరావు, వార శరత్, తోర్లపాటి యేసు, తోర్లపాటి చక్రవర్తి, ప్రత్తిపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత అని ఎంఇఒ సిహెచ్.సక్సేనారాజు అన్నారు. సోమవారం ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజ్వల స్వచ్ఛంద, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో హెచ్ఎం మాణిక్యాలరావు, ప్రజ్వల ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ తదితరుల సమక్షంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నేరమన్నారు. పేద, మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువగా దీనికి గురవుతున్నారన్నారు. ఉద్యోగం, ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసి, వారిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారన్నారు. కాబట్టి ఉపాధ్యాయులు వారిని గమనిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రొజెక్టర్‌పై లఘు చిత్రాలు ప్రదర్శించి, అనేక సూచనలు చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ప్రజ్వల కో-ఆర్డినేటర్ శ్రావ్య, సిబ్బంది అనిల్ కుమార్, సుప్రియ, కేశవ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, ఆదుర్రు
మామిడికుదురు మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఠి.క. నెం.2/2024 **టెండరు ప్రకటన** తేది.18-11-2024

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, ఆదుర్రు గ్రామపంచాయతి 2024-25 సంవత్సరమునకు ఈక్రింది షెడ్యూలు దాఖలా పనులకు సీల్డు టెండర్లు ఈక్రింది సంతకం చేసిన వారిచే ది. 22-11-2024వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2.00 గం॥లకు స్వీకరించబడి, అదేరోజు మధ్యాహ్నం గం॥ 2.30 ని॥లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. టెండర్లుకు డిపాజిట్ షెడ్యూల్‌లో చూపిన విధముగా రుసుము చెల్లించి దాఖలు చేయవలెను.

వ.నెం.	వివరములు	ధరావత్తు
1	ఆదుర్రు గ్రామపంచాయతి ఆవరణలో ఆర్.సి.సి. కాంక్రీట్ బ్రిక్స్‌తో ఫ్లోరింగ్ నిర్మాణం చేయుట గురించి Bit: I అంచనా - 2 లక్షలు	10,000/-
1	ఆదుర్రు గ్రామపంచాయతి ఆవరణలో ఆర్.సి.సి. కాంక్రీట్ బ్రిక్స్‌తో ఫ్లోరింగ్ నిర్మాణం చేయుట గురించి Bit: II అంచనా - 2 లక్షలు	10,000/-

సదరు పనులకు సొమ్ము పంచాయతి నిధులను బట్టి ప్రయారిటీ పద్ధతిలో చెల్లించబడును.

సం/- **బళ్ళ శ్రీనివాసరావు**
సర్పంచ్, గ్రామపంచాయితీ, ఆదుర్రు
మామిడికుదురు మండలం

సం/- **బి.వి.వి.సత్యనారాయణ**
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ
ఆదుర్రు, మామిడికుదురు మండలం

మహారాజశ్రీ రాజమహేంద్రవరం గౌరవనీయులైన 7వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం.184/2024

పార్టీలు:
బళ్ళ జగదీశ్వరరావు (రిప్రెజెంటెడ్ బై జనరల్ పవరాఫ్ అటార్ని హౌల్డరు, బండారు వెంకటేశ్వర రావు) ...వాది
మరియు
తమ్మన సూర్య వినోధ్, ...ప్రతివాది
తమ్మన సూర్య వినోధ్ (తండ్రి) వెంకటరామగుప్త హిందువు, వయస్సు 41 సం॥లు, డోరు నెం. 7-26, మురమండ, కడియం మండలం తూర్పుగోదావరి జిల్లా. ...ప్రతివాది

పై వాది మీరు వ్రాసిన తనఖా దస్తావేజును పురస్కరించుకొని ప్రిలిమినరీ డిక్రీ జారీ చేయమని దాఖలు చేసిన పై దావా మీ హాజరుకు గాను పై కోర్టులో ది.11.12.2024వ సం.రం. తేదీకు వాయిదా అయి వున్నది. కావున మీరు పై కోర్టు ఎదుట ది.11.12.2024వ సం.రం. తేదీ ఉదయం గం.10-30 ని॥లకు గాని స్వయముగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలియపర్చుకోగలరు. లేని యెడల పై దావానుమీ పరోక్షమున నిర్ధారింపబడును.

యమ్.ఆర్.సత్యసాయి (రాంబాబు)
పిటిషనర్ తరపున అడ్వకేట్.
డోరు నెం.86-11-11/1
వాడ్రేవునగర్, తిలక్ రోడ్డు, రాజమండ్రి

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, యు.కొత్తపల్లి మండలం, పాత ఇసుకపల్లి గ్రామం గ్రామ కాపురాస్తుడైన దడాల నాగ వెంకట సత్యనారాయణ, తండ్రి దడాల బాలరాజు ది. 13-11-2024వ తేదీన పాస్‌పోర్ట్ నెం. **L9661351** రెన్యూవల్ నిమిత్తం పాత ఇసుకపల్లి నుండి యు.కొత్తపల్లి వెళ్తుండగా మార్గం మధ్యలో పడిపోయింది. ఎవ్వరికైనా దొరికిన యెడల ఈ క్రింద అడ్రస్‌కు తెలియజేయగలరు.

నా అడ్రస్:
దడాల నాగ వెంకట సత్యనారాయణ
తండ్రి: బాలరాజు, పాత ఇసుకపల్లి గ్రామం
యు.కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా.
సెల్ నెంబర్: 9573252903

ప్రకటన

కీ॥శే॥ శ్రీ **బండారు నాగభూషణం** (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, విలసవిల్లి గ్రామ కాపురస్తులు బండారు వెంకట దుర్గారావు, S/o. నాగభూషణం (లేటు) గారి కుమారుడు బండారు వెంకట దుర్గారావు గారు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.
నా తండ్రి గారు **బండారు నాగభూషణం** విలసవిల్లి గ్రామంలో మా ఇంటి వద్ద 06-2-2009 సం॥రంలో మరణించారు. వీరి మరణం గ్రామపంచాయతీలో నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: **బండారు వెంకట దుర్గారావు**
S/o. నాగభూషణం, డోర్ నెం. 4-27
విలసవిల్లి గ్రామం, ఉప్పలగుప్తం మండలం
సెల్: 99514 14599

ప్రకటన



కీ॥శే॥ శ్రీమతి **బండారు వీరవేణి** (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, విలసవిల్లి గ్రామ కాపురస్తులు బండారు వెంకట దుర్గారావు, S/o. నాగభూషణం (లేటు) గారి కుమారుడు బండారు వెంకట దుర్గారావు గారు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.
నా తల్లి గారు **బండారు వీరవేణి**, W/o. నాగభూషణం, విలసవిల్లి గ్రామంలో మా ఇంటి వద్ద 28-3-2009 సం॥రంలో మరణించారు. వీరి మరణం గ్రామ పంచాయతిలో నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: **బండారు వెంకట దుర్గారావు**
S/o. నాగభూషణం, డోర్ నెం. 4-27
విలసవిల్లి గ్రామం, ఉప్పలగుప్తం మండలం
సెల్: 99514 14599

బహిరంగ ప్రకటన

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలం, మండపేట, డోరు నెం. 34-19-10/3 కాపురస్తులు పెంజర్ల నాగ వీరవెంకట సత్య సూర్య వినాయక వరప్రసాద్ గారి భార్య పెంజర్ల పద్మ నాగేశ్వరి అను నేను ప్రమాణముపై దాఖలు చేసుకున్న అఫిడవిట్ కమ్ ఇండెమినిటీ బాండు సంగతులు ఏమనగా,

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలం, మండపేట గ్రామం తాలూకు స్థిరాస్తికి సంబంధించిన క్రయ దస్తావేజుకు ద.నెం. 1876/2020 రుకు గల లింకు క్రియ దస్తావేజు నెం. 1406/2002 రు మిస్ అయినది. మల్లాడి ప్రభాకరరావు వగైరాల వల్ల క్రియం పొందినటు వంటి క్రియ దస్తావేజు అయి వున్నది. సదరు ద.నెం. 1876/2020రుకు లింకు దస్తావేజు అయి వున్నది. సదరు పైన వివరించబడిన లింకు క్రియ దస్తావేజును పోగొట్టుకున్న విషయమును గురించి పోలీసు వారికి కంప్లైంట్ చేయడం కూడా జరిగినది. కనుక సదరు పై విషయములు అన్నియూ యదార్థములు నియూ, సదరు విషయములు భవిష్యత్తులో అవాస్తవములని తెలియవచ్చిన యెడల మీరు నాపై జరిగించు చట్టపరమైన చర్యలకు మరియు ఐ.పి.సి. 199/200రు ప్రకారం నాపై మీరు తీసుకొని చర్యలకు నేను పూర్తి బాధ్యత వహించగలనని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

ఎస్.తాతారెడ్డి, అడ్వకేట్ / నోటరీ
రామచంద్రాపురం
రామచంద్రాపురం
18-11-2024
సెల్: 9866960337

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం
ARBEP No30/2023
A.C.No.461/2016

Between:
Ms.Shriram Finance Ltd., (Formerly known as Shriram Transport Finance Company Ltd.) Rajahmundry Branch, Rep by it GPA Holder, SaiSubrahmanyam R/o.Rajahmundry ...Dhr
And
Biruduganti Uaday Kumar and others ...JDRs
1. Biruduganti Uaday Kumar, S/o. Narasimha Rao, Aged 48 years, Business, D.No.1-2-28R/32/R, Indira Park X Road, Hyderabad, Talanga State. ...1stJDr

పై నెంబరు E.P. లో 1వ JDr అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు Or 21, Rule 22 CPC ప్రకారం నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయు చున్నారు. కావున ది. **19-11-2024** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై E.P. లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు E.P. ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పురంశెట్టి సత్యరమేష్
అడ్వకేటు,రాజమండ్రి

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 690/2022

Between:
Nambathula Prabakaram ***...Petitioner/ Petitioner***
AND
Thirumalanadhuni Rajababu and Others ***...Respondents***
1. Thirumalanadhuni Rajababu, S/o. Kondalarao, Hindu, aged 38 years, Driver cum Owner of the Goods Auto, bearing No. AP 05 W 7088, R/o. D.No. 1-192, West Ganugudem, Korukonda, E.G.Dist., 533289. ***...1st Respondent***

పై నెంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 02-12-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.సతీష్‌కుమార్
జి.అంబికా ప్రసాద్
రాజమండ్రి 09-11-24
అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 291/2023

Between:
Bogireddy Nageswara Rao ***...Petitioner/ Petitioner***
AND
Dola Dilli Naidu and Others ***...Respondents***
1: Dola Dilli Naidu, S/o. Dola Ramu, Hindu, aged 27 years, Driver of the crime vehicle Auto bearing No. AP 16 TL 1233, R/o. D.no. 18-171, Siddi Nagar, Sanath Nagar, Kanuru, Penamaluru, Krishna Dt., ***...1st Respondent***

పై నెంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 28-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.సతీష్‌కుమార్
జి.అంబికా ప్రసాద్
రాజమండ్రి 05-11-24
అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 136/2023

Between:
Buddiga Janardhana ***...Petitioner/ Petitioner***
AND
Chippada Madhu Kumar,S/o. Suryanarayana and Others ***...Respondents***
R-2: Palli Nageswara Rao, S/o. Appa Rao, aged 55 years, Owner of the Eicher Van crime vehicle bearing No. AP 16 TS 7667, R/o. D.No. 3-223, Ganesh Nagar, Rajamahendravaram, E.G.Dt., RJCJ. ***...2nd Respondent***

పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 02-12-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.సతీష్‌కుమార్
జి.అంబికా ప్రసాద్
రాజమండ్రి 09-11-24
అడ్వకేట్స్, రాజమండ్రి